కథ

# అంతరంగం

- భమిడి వెంకటేశ్వర్లు

ఏం చేసేందుకూ తోచటంలేదు. టి.వీ చూడాలన్నా, రేడియో వినాలన్నా మనసు కుదురుగా లేదు. పేపరు మాత్రం ఎలానో చదివి పక్కన పడేశాడు. రకరకాల ఆలోచనలు. నిర్లిప్తత, నిరాశ, అధైర్యం, ఆవరించింది. కాసేపు అలా సెంటరుదాకా వెళ్ళొస్తేసరి ! కాలక్షేపంగా వుంటుందని పించగానే, బట్టలు మార్చుకోడానికి లేచాడు చక్రవర్తి. అంతలో గేటు చప్పుడైంది. ఎవరాని చూస్తే.... సీతారామయ్య!

"ఈవేళ ఎందుకొచ్చినట్టు...... ఆదివారం కదా" అనుకున్నాడు. ఆలోచనలు పక్కనపెడదామనుకుంటే - తండ్రిరాకతో కొత్త సమస్యలు, ఆలోచనలు రేగుతాయి. అది చక్రవర్తికి అనుభవమే.

"ఏమిటి విశేషాలు.... ఎలావున్నావు?" తండ్రిని పలకరించాడు చక్రవర్తి - మంచినీళ్ళ గ్లాసు చేతికిస్తూ.......

"నీకు బుద్ధి, జ్ఞానం వుందా" సీతారామయ్య ఒక్కసారిగా రెచ్చిపోయాడు. చక్రవర్తి షాక్ తిన్నాడు. ఆయన ధోరణికి, ఏదో అడగాలని.... అడగలేని పరిస్థితి ఎదురైంది.

"ఒంట్లో బాగుంటోందా.... మందులు వాడుతున్నావా " అని అడిగాడు చక్రవర్తి.

"నువ్వు నన్ను పట్టించుకోడం మానేసావు. నేను నీకు అవసరం లేదు. నన్ను చూసేందుకు రావు. నేను రావాలి - ఈ వయస్సులో బస్సులు రద్దీ..... రోడ్డుమీద నడవాలంటే భయం - ఏసైడు నుంచి ఎవరొచ్చి గుద్దేస్తాడోనని .... కళ్ళు సరిగా కనపడవు..... నడుస్తుంటే తూలు వస్తోంది..... " చెప్పుకుపోతున్నాడు సీతారామయ్య.

చక్రవర్తి తండ్రికి ఎదురు చెప్పదల్చుకోలేదు. గతంలో అయితే, గట్టిగా జవాబిచ్చేవాడు. ఆయనకే కాదు, తనమీద సవారీ చేద్దామని ప్రయత్నించిన వారిమీద కోపాన్ని ప్రదర్శించేవాడు - ఎందుకు మాటపడాలన్న ఉద్దేశంతో, ఫలితంగా తను చెడ్డ వాడయ్యాడు. శత్రువుగా చిత్రించబడుతూ రాసాగాడు. స్నేహితులు తక్కువయి పోసాగారు. గ్రహబలం సరిగా లేదనిపించింది.

" ఇప్పుడేమయింది" అడిగాడు చక్రవర్తి.

" నా ఆరోగ్యం గురించీ, నాగురించి, కనీసం ఫోనులోనైనా తెలుసుకోవచ్చు కదా....." సీతారామయ్య మండిపడ్డాడు.

"లేదని ఎవరు చెప్పారు" వెంటనే అడిగేసాడు. చక్రవర్తి. "ఒకరేమిటి.... నువ్వు ఫోను చేసినవాళ్ళనే అడిగాను. .... ఎవరూ నాగురించి ఫోను చెయ్యలేదన్నారు....." అన్నాడు సీతారామయ్య గొణుగుతూ....

"అంతా బావున్నారా" అడిగాడు చక్రవర్తి మళ్ళీ "నీకేం..... హాయిగా పిల్లల పెళ్ళిళ్ళు చేసేసావు. హాయిగా కాలక్షేపం చేస్తున్నావు. తమ్ముళ్ళు, చెల్లెళ్ళు, బావలు, చుట్టాల గురించి అవసరం లేదు".

చక్రవర్తికి తండ్రి కార్యక్రమం బోధపడింది. ఇదంతా తన ఖర్మ.... దురదృష్టం. ఎవరూ తనని సరిగా అర్థం చేసుకోటంలేదు. తను ఎంత ముందుకు వెళ్ళి ఆప్యాయంగా కలుపుకుందామనుకున్నా, అవతలవారు తనని దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇది గ్రహించిన చక్రవర్తి కూడా అదే దారిలో నడవాలనుకున్నా వీలు పడటం లేదు.

"తోడబుట్టిన వాళ్ళు పరాయి వాళ్ళు కాదు. వాళ్ళు నీకు చెల్లెళ్ళు, వాళ్ళని ఏడాదికి రెండుసార్లయినా పండుగలకు పిలిచి చీరలు పెట్టాలి.... నేను ఇప్పటికీ నా చెల్లెళ్ళను ఇంటికి పిలవకపోయినా మనియార్డరు ద్వారా డబ్బు పంపుతాను. వాళ్ళకి చదువులు చెప్పించి, వివాహాలు కూడా జరిపించాను. నాతో పోల్చుకుంటే నువ్వు చేస్తున్నది ఎంత?

ప్రేమ అన్నది ఇతరులను తనవైపు ఆకర్షించే అయస్కాంతం. - షిరిడీ సాయిబాబా

ఆలోచించావా.... పైగా పెద్ద కొడుకువి నువ్వు. నా తరువాత వాళ్ళందరినీ కనిపెట్టవలసిన బాధ్యత నీది అని తెలుసా నీకు....." సీతారామయ్య కోపంగా అంటున్నాడు.

షాక్ తిన్నాడు చక్రవర్తి.

జవాబు చెప్పలేదు. అయినా చెప్పక తప్పలేదు. "మరి తాతయ్య - అదే, మీ నాన్న పిల్లలకోసం ఏమీ చేయలేదా...... ఆయనకేమీ బాధ్యత లేదా! నీతో బాటు మిగిలిన తమ్ముళ్ళు పట్టించుకోరా....." - అంటూ.

సీతారామయ్యకు ఆశ్చర్యం కలిగింది. ఈ విధంగా సమాధానం చెప్పడం చక్రవర్తికి కొత్తకాదు. గతంలో కూడా రెండు మూడు సందర్భాల్లో అన్నాడు.

"నీకు వయసుతోపాటు కోపం పెరిగిపోతోంది. అది మంచిదికాదు" సీతారామయ్య మరోబాంబు పేల్చేడు.

రెండు నెలల క్రితం చక్రవర్తి యింటికి సాయంత్రం ఆరుగంటలకు వచ్చాడు సీతారామయ్య. అప్పుడు యింటికి తాళం వేసివుంది. చక్రవర్తి భార్య పుట్టినరోజు కావడంతో దగ్గర్లో వున్న అమ్మవారి గుడికి, శివాలయానికి వెళ్ళారు. తాళం చూడగానే సీతా రామయ్యకు కోపం నషాళానికి పెరిగింది. ఎదురింట్లోను, పక్కింట్లోను విచారించాడు. నోటి కొచ్చిన తిట్ల పర్వాన్ని వల్లించాడు. తరువాత యింట్లో అద్దెకుంటున్న వారిని అడిగాడు. మళ్ళీ మామూలే! "వీడికి చదువు చెప్పించాను, స్కూటరు కొనుక్కోడానికి డబ్బు సాయం చేసాను. కూతుళ్ల వివాహాలకు పాతికవేలు యిచ్చాను.... " అంటూ వారి ముందు ఏకరువుపెట్టాడు.

రాత్రి ఎనిమిది గంటలకు వచ్చాడు చక్రవర్తి. అప్పటికి అరుగుమీదున్న తండ్రిని చూసి షాక్ తిన్నాడు. ఆ టైములో ఆయనరాడు. అయిదుగంటల లోపే వచ్చేస్తాడు ఎప్పుడొచ్చినా! "ఎంతసేపైంది వచ్చి" అంటూ పలకరించాడు తను.

"తమరికి పుట్టినరోజులు... గుళ్ళు గోపురాలు గుర్తుంటాయి. పెళ్ళాంతో షికార్లు - సినిమాలు కావాలి. ఈ ముసలిపీనుగ అవసరంలేదు". సీతారామయ్య సహజధోరణిలోనే చెప్పాడు.

అయినా మౌనం వహించలేకపోయాడు చక్రవర్తి. "వస్తున్నట్లుగా ఫోను చేయలేకపోయావా!" అని మాత్రం అడిగాడు. 'విషయాన్ని వివరంగా చెబుతూ...'

" ఆ ఖర్చెందుకు......"

కోడలు వచ్చి పలకరించింది తరువాత.

కొంచెం సేపయ్యాక ఎదురింటావిడ, పక్కింటాయన వచ్చి సీతారామయ్య చెప్పిన విషయాలను చెప్పారు. వారికి అసలు విషయం బోధపడింది - చక్రవర్తికేమీ లేదని, ఇల్లు తండ్రి కట్టించి ఇచ్చిందేనని - తండ్రిని పట్టించుకోడని..... చక్రవర్తి - అసంగతే తండ్రిని అడగాలనుకున్నాడు. కాని ప్రయోజనం లేదని విరమించుకున్నాడు.

ఆ టైములో తండ్రిరాక బోధపడలేదు. పైగా యీ విధమైన వ్యాఖ్యలు... ఎందుకు చేసాడో తెలియలేదు.

"నాకోసం వంట చెయ్యొద్దు. మజ్జిగనీళ్ళు ఓ గ్లాసుతో యిస్తే చాలు. చాప పడేస్తే పడుకుంటాను." అన్నాడు కొడుకుతో.

కోడలికి మావగారి మాటలు వింటుంటే కోపం ఆగటంలేదు. భర్తని లోపలకు పిలిచింది. " మీ నాన్నగారికి యిక్కడకొస్తేనే నోరులేస్తుంది. మిగిలిన కొడుకులు - కోడళ్ల దగ్గర పెగలదు. ఇదంతా మనం నోరు విప్పకపోవడం వల్లే..... " అంటూ మందలింపు ధోరణిలో అంది.

"ఫరవాలేదులే.... నిజం నీకుతెలుసు-నాకు తెలుసు. భగవంతుడికి తెలుసు" చక్రవర్తి అనునయంగా భార్యతో చెప్పాడు.

" అందుకే మీరంటే విలువలేకుండా పోయింది. మంచిమర్యాద లేకుండా వాగుతున్నా

డాయన. మనం ఏం తక్కువ చేసామని! మన కోసం ఏం చేసాడు ఆయన! మిమ్మల్ని కన్నాడేమో కాని - మీకు యిల్లు కట్టించాడా...... పిల్లల వివాహాలకు సాయం చేసాడా..... ఇన్ని అబద్ధాలు ఎందుకు? పైగా కోపం కూడదంటూనే ఆయనకు యింత కోపం మరి...... " భార్యమాటల్లో నిజం లేకపోలేదు. ఒకటి మాత్రం నిజం. ఇంటి పెద్ద కొడుకుగా పుడితే - వారిలో ప్రత్యేకతతో పాటు, కొన్ని బాధ్యతలు - మంచి, మర్యాద, అభిమానం, ఆప్యాయతలు వుంటాయి. మిగిలిన వారిలో " సూరేకారం" పాళ్ళు అధికం..... స్వార్థం, నిర్లక్ష్యం, కూడా ఎక్కువే అని చాలా సంసారాల్లో గమనించాడు. చక్రవర్తి.

" ఈ రోజుల్లో సెంటిమెంటు, ఎటాచ్‌మెంటు అంటూ ఎవరూ పాకులాడటం లేదు. ఇది డబ్బులోకం.... దానికోసం పరుగు..... ఆరాటం. ఎదుటి వారి నుంచి ఆశించి నొక్కేయాలని..... పట్టేయాలని- ఆలోచన ! మీకు తప్ప " అని చక్రవర్తితో ఎన్నోసార్లు అంది భార్య

"జీవితంలో ఎన్నోరకాలుగా సమస్యలు వస్తుంటాయి. రకరకాల మనుషులు ఎదురువు తుంటారు. మరెన్నో విమర్శలు, వ్యాఖ్యలు వింటుంటాము. అన్నీ పట్టించుకుంటే మనం బతక లేము........" అని కూడా చెప్పాడు చక్రవర్తి.

"ఇంతకీ మీ నాన్నగారు ఎందుకొచ్చినట్లు?" మళ్లీ అడిగింది ఆమె.

"అడిగిచూడు........ నీకే చెబుతాడు."

"సర్లెండి......... అత్తమామలకు కొడుకులు కావాలి, వారి భార్యలు అక్కర్లేదు. వీళ్ళు తెచ్చే మూటలు మాత్రం కావాలి. మీరే పనికిరానప్పుడు, మిమ్మల్నే నానామాటలు అంటుంటే ఇక నా విషయం చెప్పాలా" అంది భార్యామణి.

సీతారామయ్యకు సైనిక్‌పురి దగ్గర ఓ యింటి స్థలం వుంది. చక్రవర్తికి ఆ విషయం తెలియనే తెలియదు. అది కొన్న ఎనిమిదేళ్ల తరువాత తెలిసింది. ఒకరోజు చక్రవర్తి తండ్రిని చూసేందుకు వెళ్లినప్పుడు - ఆ యింట్లో ముగ్గురు కొత్తవ్యక్తులు కనిపించారు. " ఎవరు వాళ్ళు? " అని అడిగాడు తల్లిని.

ఆవిడ చాలా సేపటి వరకు అసలు విషయం చెప్పలేదు. కానీ చక్రవ[ర్తి బ]యలుదేరే ముందు మాత్రం స్థలం గురించి [చె]ప్పి....... అమ్మేసినట్లుగా చెప్పిందావిడ.

" ఆ లక్షరూపాయలు ఏంచేసారు?" అని అడిగాడు చక్రవర్తి. తల్లికి కోపం వచ్చింది.

" ఈ యింట్లో ఏం జరుగుతున్నా మీరేం చేస్తున్నా నాకు చెప్పరు. అయినా నాకు తెలుసు. ఇంటి పెద్ద కొడుక్కి చెప్పాల్సిన అవసరంలేదా! అది మీ బాధ్యతకాదా" అని నిలదీసాడు చక్రవర్తి.

ఈ విషయాలు సీతారామయ్యకు తెలిసాయి. "ఇది నాస్వార్జితం నాయిష్టం వచ్చినట్లు చేస్తాను. నీకు చెప్పవలసిన పని - అవసరం లేదు." అనేసాడాయన.

షాక్ తిన్నాడు చక్రవర్తి.

" మీ అమ్మగారికి చంద్రహారాల గొలుసు, గాజులు, పగడాల గొలుసు వుండాలి. అవి యిప్పుడు లేవు. మిగిలిన కోడళ్లకు యిచ్చేసిందావిడ.... మరి నాకు ఏం యిచ్చింది. మీకేం యిచ్చేడు మీనాన్న?" విషయం తెలిసి చక్రవర్తిని అడిగింది భార్య ఒకరోజు.

"మా అమ్మా,నాన్నల ఆశీస్సులతోనే పెరిగి పెద్దవాడినై నిన్ను చేసుకున్నాను. నాకు నువ్వే చంద్రహారాల గొలుసువి.... పగడాల గొలుసువి.... గాజుల జతవి....... అంతకన్నా ఏం కావాలి...." అన్నాడు చక్రవర్తి నవ్వుతూ........

"చూడండి...... దీన్నే పనికిరాని పరిజ్ఞానం అంటారు. వేదికల మీద ఉపన్యాసాలు యిచ్చే వాళ్ళు కూడా, దిగిపోయాక అవలంబించేది చాటు మార్గాన్నే ! మీ వాళ్లని చూసైనా బుద్ధి తెచ్చుకోండి. అందరి పిల్లల్ని సమానంగా చూడకపోతే, వాళ్లల్లో

ప్రతితరం తల్లిదండ్రులమీద తిరగబడుతుంది. - తాతలతో చెయ్యికలుపుతుంది. - వర్డ్స్‌వర్త్

తల్లిదండ్రులపట్ల అభిప్రాయభేదాలు వస్తాయి.... అది మీ విషయంలో పాతికేళ్ళుగా నేను గమనిస్తూనే వున్నాను. " అంటూ మందలించింది భార్య.

చక్రవర్తి స్వగతంలోనే నవ్వుకున్నాడు. చక్రవర్తికి ఆ రాత్రి ఎంతకీ నిద్రపట్టలేదు. ఒకవైపు తండ్రి ప్రవర్తన.... నోటి దరుసు! మరోవైపు యితరుల వ్యాఖ్యలు - విమర్శలు.

ఆ రాత్రి భోజనం చేసి, కాసేపు పేపరు చదివి నిద్రపోయాడు సీతారామయ్య. రాత్రి ప్రశాంతంగానే గడిచింది. పొద్దున్నే కాఫీ యిస్తూ చెప్పింది " మీ నాన్నగారు యింటిని, నాలుగో తమ్ముడికి రాసేసారుట" అని.

ఆశ్చర్యపోయాడు చక్రవర్తి.

"కావాలంటే ఆయన్నే అడగండి" - అందామె.

"అవునా యిది" అని తండ్రిని అడిగాడు చక్రవర్తి.

"అవును ఎప్పుడో పదిహేనేళ్ళ క్రితమే, మీ అమ్మ మాట ప్రకారం రాసాను. అయినా మీ అందరికీ యిళ్ళున్నాయి వాడికిలేదు. " అన్నాడు సీతారామయ్య.

చక్రవర్తికి ఏం చెప్పాలో అర్థం కాలేదు.

భార్య మాటలు గుర్తుకొచ్చాయి. తను తరచు హెచ్చరిస్తూనే వుంటుంది. కానీ తనే పట్టించుకోడు.

సీతారామయ్య ఏదో అడగాలని ప్రయత్నించడం చాలా సార్లు గమనించాడు చక్రవర్తి.

"నువ్వు ఓ పని చేయాలి" విషయంలోకి వస్తూ అన్నాడు సీతారామయ్య.

"ఏమిటి? "

"నీకు బాధ్యతలు తీరాయి, ఖర్చులు లేవు. పైగా మీరు యిద్దరే ! మీరుంటున్న యిల్లు మీకు రెండు వేలదాకా అద్దె సంపాదించిపెడుతోంది. నీకు జీతంలో మినహాయింపులు పోగా ఏడెనిమిది వేలు చేతికొస్తాయి. రెండేళ్ళలో రిటైరయిపోతావు. ఎంత లేదన్నా ఏడెనిమిది లక్షలదాకా రిటైర్మెంట్ బెనిఫిట్సు వస్తాయి నీకు. ఏంచేస్తావు యీ డబ్బంతా ? " అని అడిగాడాయన.

చక్రవర్తి నవ్వేసాడు. "ఇంతకీ విషయం ఏమిటి?" అని అడిగేడు వెంటనే.

"నీకు యిద్దరూ ఆడపిల్లలే. నీ అల్లుళ్లకు సొంత యిళ్ళున్నాయి. ఈ యిల్లు నీ పిల్లలకిస్తావు.... వాళ్ళూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు.... " అంటూ - ఆగాడు పెద్దాయన.

"నువ్వేం చెప్పాలనుకుంటున్నావు ?"

నీకు ముగ్గురు చెల్లెళ్ళున్నారు. వాళ్ళదగ్గర ఆరుగురు, పిల్లలున్నారు, వారికి వివాహాలు చేయాలిగా. ఎంతలేదన్నా, పదిహేను పద్దెనిమిది లక్షలుంటేగాని వివాహాలు కావు. అల్లుళ్ల సంగతి నీకు తెలియనిదికాదు. పిల్లల్ని కన్నారేగాని, ఆస్తిపాస్తులు సంపాదించుకోలేదు వాళ్ళు..... " చెబుతున్నాడాయన.

చక్రవర్తికి విషయం బోధపడింది.

భార్య అతన్ని లోపలకు పిలిచింది.

పది నిముషాలు గడిచాయి.

"ఇప్పుడు నేనేం చెప్పలేను. ఆలోచించాలి. నా పెళ్ళాం- పిల్లలతో" అన్నాడు చక్రవర్తి.

సీతారామయ్యకు కోపం వచ్చింది. " పెళ్ళాం మాటలు విన్నవాడు ఎవడూబాగు పడలేదు ఈలోకంలో..... మనకంటూ ఆలోచనలు, నిర్ణయాలు వుంటాయి........" అనేసాడు.

"మరి నీ నిర్వాకం ఏమిటయ్యింది. నువ్వు కూడా అమ్మ మాట ప్రకారం చేసేనన్నావు కదా....... అని అనాలనుకున్నాడు చక్రవర్తి.

"ఈ సారి వచ్చినప్పుడు నా నిర్ణయం చెబుతాలే" అన్నాడు అతను.

మరో పథకం ఆలోచిస్తూ వెళ్ళిపోయాడు సీతారామయ్య తనతొందరపాటుకు తిట్టుకుంటూ...

✿ ✿ ✿

దేశం అభివృద్ధి చెందటమంటే గాలిలో మేడలు, రంగులగోడలు కాదు. పౌరుల నైతికాభివృద్ధే నిజమైన అభివృద్ధి